
మసకబారుతున్న వెలుతురు



మహబూబ్‌నగర్ పట్టణ ప్రధాన రహదారిపై వెలుగుతున్న వీధిలైట్లు

- మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో పూర్తి స్థాయిలో వెలగని వీధి లైట్లు
- పురపాలికల్లో ఈఈఎస్ఎల్, గ్రామాల్లో రెడ్‌కో సంస్థలకు మెయింటెనెన్స్ బాధ్యతలు
- పాడైన వాటి స్థానంలో ఏర్పాటు చేయని కొత్త బల్బులు
- సామగ్రి సక్రమంగా సరఫరా చేయని ఆయా సంస్థలు
- లైట్లు ఇస్తే గొట్టాలు ఉండవు.. గొట్టాలు ఇస్తే లైట్లు రావు
- ఈ ఏడాది అక్టోబరుతో ముగియనున్న సంస్థల లీజు గడువు
- కొత్తవారికి కేటాయించాలంటూ ప్రజాప్రతినిధుల డిమాండ్
- ఎల్ఈడీలతో 40-50 శాతం మేర విద్యుత్ బిల్లుల ఆదా
- ఆయా సంస్థలకు రూ.10 కోట్ల బకాయిలు

మహబూబ్‌నగర్, జూలై 13: ఉమ్మడి జిల్లాలోని మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో వీధి లైట్ల వెలుతురు మసక బారుతోంది. లీజుకు తీసుకున్న ప్రైవేటు సంస్థలు పాడైన లైట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయకపోవడం, అవసరమైన వాటికి మరమ్మతులు చేయకపోవడంతో చీకట్లో మగ్గుతున్నాయి. వీధి లైట్లకు గతంలో ఆన్, ఆఫ్ నియంత్రణ లేకపోవడం వల్ల విద్యుత్ వినియోగం పెరిగి, ప్రతీ నెల బిల్లులు చెల్లించేందుకు ఎంతో ఇబ్బందిపడేవి. ఈ నేపథ్యంలో నాటి ప్రభుత్వం ఏడేళ్ల క్రితం మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో పాత బల్బుల స్థానంలో ఎల్ఈడీ బల్బులు అమర్చాలని నిర్ణయించింది. దీనివల్ల విద్యుత్ ఆదా అవడంతోపాటు నిర్వహణ బాధ్యతను సంస్థలకు అప్పగిస్తే వాళ్లే చూసుకుంటారని భావించింది. 2017లో ఉమ్మడి జిల్లాలోని 19 మునిసిపాలిటీల ఎల్ఈడీ బల్బుల నిర్వహణ బాధ్యతను ఈఈఎస్ఎల్(ఎనర్జీ ఎఫీషియెన్సీ సర్వీస్ లిమిటెడ్)కు అప్పగించారు. గ్రామ పంచాయతీల బాధ్యతను రెడ్‌కో సంస్థకు అప్పగించారు. అయితే అప్పట్లో లైట్ల మెయింటెనెన్స్ గ్రామ పంచాయతీలకే ఇవ్వాలని సర్పంచ్‌ల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. అయినా అధికార యంత్రాంగం పట్టుబట్టి తీర్మానాలు రాయించి, సంస్థలకు బాధ్యతలు అప్పగించింది. వాటి ఏడేళ్ల లీజు పీరియడ్ ఈ ఏడాది అక్టోబరు-నవంబరు నాటికి ముగియనుంది. ప్రభుత్వం మారడంతో స్థానిక ప్రజాప్రతినిధులంతా ప్రస్తుతం మెయింటెనెన్స్ చేస్తున్న సంస్థల లీజు తొలగించి, మరొకరికి బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు.

సంస్థలకు పెద్దమొత్తంలో బకాయి

ఎల్ఈడీ బల్బులు మెయింటెనెన్స్ చేస్తున్న సంస్థలు ఈఈఎస్ఎల్, రెడ్‌కో సంస్థలకు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పురపాలికలు, గ్రామ పంచాయతీల నుంచి పెద్ద ఎత్తున బకాయి ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్క పాలమూరు పురపాలికలోనే రూ.రెండు కోట్ల వరకు చెల్లింపులు చేయాల్సి ఉంది. ఈలెక్కన అన్ని పురపాలికల్లో కలిసి దాదాపు రూ.10 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్లు సమాచారం. పాలమూరులో ప్రతీ నెల మెయింటెనెన్స్ రూపంలో రూ.25 లక్షల నుంచి రూ.27 లక్షలు చెల్లించాల్సి ఉండగా కొద్దికొద్దిగా చెల్లింపులు చేస్తున్నారు. మిగతా మునిసిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. కాగా, ఆయా సంస్థల లీజు పీరియడ్ కూడా మరో మూడు నాలుగు నెలల్లో ముగియనున్నందున మెటీరియల్ సక్రమంగా సరఫరా చేయడం లేదన్న ప్రచారం సాగుతోంది. ఎల్ఈడీల బల్బుల వల్ల విద్యుత్ బిల్లులు గతంలో పోలిస్తే 40-50 శాతం మేర తగ్గినట్లు స్పష్టమవుతోంది.

అరకొరగా సామగ్రి

మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీల వీధి లైట్ల బాధ్యతను ప్రైవేట్ సంస్థలకు అప్పగించాక, కొత్త లైట్లు వేయడంతో మొదటి రెండు మూడేళ్ల మంచి ఫలితాలు వచ్చాయి. ఏస్తంభానికి చూసినా లైట్లు వెలగడంతో గ్రామాలు, పట్టణాలు విద్యుత్ కాంతులతో విరజిల్లాయి. గతంలో ఉన్న లైట్ల వెలుతురు కంటే ఎల్ఈడీ లైట్ల వెలుతురు ప్రకాశవంతంగా ఉండటంతో అప్పటిదాకా వ్యతిరేకించిన సర్పంచ్‌లు కూడా సర్దుకుపోయారు. అయితే నిర్వహణలోపం కారణంగా రానురాను ఎల్ఈడీ వెలుతురు కాస్త మసక బారుతూ వస్తోంది. కొత్తగా వేసిన లైట్లు పాడవడం, పాడైన లైట్ల స్థానంలో కొత్తవి వేయకపోవడం, అవసరమైన వాటికి సకాలంలో మరమ్మతు చేయకపోవడంతో రెండేళ్లుగా సమస్యలు తలెత్తుతున్నాయి. ఆయా సంస్థలు ఎల్ఈడీ బల్బులు ఇస్తే వాటికి కావలసిన గొట్టాలు సరఫరా చేయడం లేదు. గొట్టాలు ఇస్తే లైట్లు ఇవ్వడం లేదు. ఈ ఎల్ఈడీ బల్బులలో కొన్నింటికి కొంత కాలం తర్వాత మరమ్మతులు చేయాల్సి ఉండగా, మరికొన్ని పాడయ్యేదాక వాడుకుని కొత్తవి వేసుకోవాల్సి ఉంటుంది. అయితే అవసరమైన వాటికి కొన్నాళ్లుగా మరమ్మతులు చేయడం లేదు. పాలమూరు పురపాలికలో ఈఈఎస్ఎల్ సంస్థ ఎల్ఈడీ లైట్ల మెయింటెనెన్స్ కోసం 10 మందిని పనిలో పెట్టుకుంది. వీళ్లు బల్బులు మరమ్మతులు చేయడం లేదని, కొత్తవి వేయడం లేదని, కొత్త కాలనీలలో స్తంభాలకు లైట్లు అమర్చడం లేదని ఫిర్యాదులు ఉన్నాయి. వారేమో తమకు జీతాలు సక్రమంగా ఇవ్వడంలేదని చెబుతున్నారు. పాలమూరు పురపాలిక పరిధిలో దాదాపు 25 వేల స్తంభాలు ఉన్నాయి. కాగా ప్రతీ కౌన్సిల్ సమావేశంలో వీధి లైట్ల విషయమై సభ్యులు నిలదీస్తున్నారు.



మెటీరియల్ సరఫరాలో ఇబ్బందులు

ఎల్ఈడీ లైట్లు, మెటీరియల్ సరఫరాలో ఇబ్బందులు ఉన్నాయి. కొన్నాళ్లుగా లైట్లు, ఇతర సామగ్రి తక్కువ సంఖ్యలో రావడం వల్ల వార్డులకు కొద్దికొద్దిగా సప్లై చేస్తున్నాము. కొద్ది రోజులు చూసి ఏం చేయాలని కౌన్సిల్‌లో నిర్ణయం తీసుకుంటాము. ఎల్ఈడీ బల్బుల నిర్వహణ సంస్థకు పురపాలికనుంచి ఇటీవలే రూ.కోటి వరకు చెల్లింపులు చేశాము.

- మహేశ్వర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ మునిసిపల్ కమిషనర్



ఒకే చోట అమర్చిన రెండు లైట్లు

ఫ్రీ బస్సులో కూరగాయల గిరాకీ

- నాయినోనిపల్లికి చెందిన ఓ మహిళా రైతు అమ్మకం
- మూడు రోజుల క్రితం తీసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్

హన్వాడ, జూలై 13 : మహిళలకు తెలంగాణ ప్రభుత్వం కల్పించిన ఫ్రీ బస్సు సౌకర్యం అనేక విధాలుగా ఉపయోగపడుతోంది. అయితే కూరగాయలు విక్రయించే మహిళా రైతులు బస్సు ప్రయాణాన్ని తమ అమ్మకాల కోసం కూడా ఉపయోగించుకుంటున్నారు. మూడు రోజుల క్రితం మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం నాయినోనిపల్లి గ్రామానికి చెందిన మహిళా రైతులు మహబూబ్‌నగర్‌లో కూరగాయలను విక్రయించారు. మిగిలిన కూరగాయలతో వారు రాత్రి 8.30 గంటల ప్రాంతంలో తిరిగి మహబూబ్‌నగర్ నుంచి వరిగి వెళ్లే బస్సులో ఇంటికి బయలుదేరారు. బస్సులో వారితోపాటే ప్రయాణిస్తున్న ఓ మహిళ మిగిలిన కూరగాయలను చూసి తనకు కావాలని మణెమ్మ అనే మహిళా రైతును కోరగా ఆమెకు బెండకాయలు అమ్మింది. ఆ దృశ్యాన్ని బస్సు కండక్టర్, మరికొందరు ప్రయాణికులు వీడియోల్లో బంధించారు. ఆ వీడియోలు శనివారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.



బస్సులో కూరగాయలు అమ్ముతున్న మహిళా రైతు

టీజీఎస్‌ఆర్టీసీ చైర్మన్‌గా చిక్కుడు వంశీకృష్ణ?



అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ

- కేబినెట్ విస్తరణకు ముందే ప్రకటించే అవకాశం
- నాగర్‌కర్నూల్ ఎంపీ స్థానం నుంచి సానుకూలంగా సీఎంకు లేఖలు ఇచ్చిన ఎమ్మెల్యేలు

నాగర్‌కర్నూల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి పందిరి గుంజళ్లగా ఉన్న నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భావిస్తున్నారు. ఈ క్రమంలో పార్టీకి వెన్నుదన్నుగా ఉన్న బూత్‌స్థాయి కార్యకర్తల నుంచి ఎమ్మెల్యేల దాకా నివేదిక తెప్పించుకుంటున్న సీఎం ఎవరికి ఎలాంటి పోస్టు ఇవ్వాలి అనే విషయంలో కీలకమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉమ్మడి మహబూబ్‌నగర్ నుంచి జూపల్లి కృష్ణారావుకు మంత్రివర్గంలో చోటు లభించింది. ఆయన ఎక్సైజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో కులాల వారీగా మంత్రివర్గంలో కూర్పు చేయాల్సిన క్రమంలో ఉమ్మడి జిల్లాలో జూపల్లి కృష్ణారావుకు మాత్రం చోటు దక్కింది. పార్లమెంట్ ఎన్నికల సందర్భంలో ఉమ్మడి జిల్లా నుంచి ముదిరాజ్‌లకు స్థానం కల్పిస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో మరో సామాజిక వర్గానికి మంత్రులుగా ప్రాతినిథ్యం దక్కే అవకాశం లేదు. ఈ క్రమంలో అచ్చంపేట ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానం నుంచి భారీ మెజార్టీతో గెలుపొందిన వంశీకృష్ణకు సముచిత స్థానం కల్పించాలని బలమైన డిమాండ్ అధిష్ఠానం వద్ద ఉంది. మంత్రివర్గంలో చోటు కల్పించే అవకాశం ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితుల్లో లేని కారణంగా ఆయన్ను టీజీఎస్‌ఆర్టీసీ చైర్మన్‌గా నియమించాలని బలమైన డిమాండ్ సీఎం వద్దకు వెళ్లినట్లు తెలుస్తోంది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌లోని ఎమ్మెల్యేలంతా అందుకు సీఎంకు సానుకూలంగా లేఖలు ఇచ్చినట్లు సమాచారం.

ఆగస్టు ఐదు తర్వాత ప్రకటన

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సందర్భంలో ప్రస్తుత ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ సతీమణి, ఆమ్రాబాద్ జడ్పీటీసీ సభ్యురాలు పార్టీ మారితే జడ్పీ చైర్‌పర్సన్ పదవిని ఇస్తామని ఆఫర్లు వచ్చాయి. ఆ ఆఫర్లను వంశీకృష్ణ తిరస్కరించారు. దాంతో వంశీకృష్ణకు బీఆర్ఎస్‌తో అనేక విభేదాలు ఏర్పడ్డాయి. చివరకు జిల్లాకు చెందని జడ్పీటీసీ సభ్యురాలికి చైర్‌పర్సన్ బాధ్యత ఇవ్వాల్సి వచ్చింది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న కాంగ్రెస్ అధిష్ఠానం చిక్కుడు వంశీకృష్ణకు ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయనకు టీజీఎస్‌ఆర్టీసీ చైర్మన్ పదవిని ఇవ్వాలని దాదాపు నిశ్చయం జరిగిపోయినట్లు సమాచారం. ఆగస్టు ఐదు వరకు మంచి ముహూర్తాలు లేకపోవడంతో.. ఆ తర్వాత వంశీకృష్ణను టీజీఎస్‌ఆర్టీసీ చైర్మన్‌గా ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.

అలాయ్ ఆటలు.. మహిళల బొడ్డెమ్మలు



కోయిలకొండ ఖిల్లాపై వెలిసిన పీర్లు

- కోయిలకొండలో ఘనంగా మొహర్రం వేడుకలు
- వేలాదిగా రానున్న భక్తులు

కోయిలకొండ, జూలై 13: అమ్మరో బీమమ్మ.. మా తల్లిరో బీమమ్మ అంటూ మహిళల బొడ్డెమ్మలు.. పురుషుల అలయ్ ఆటలతో మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండలో బీబీ ఫాతిమా మొహర్రం ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. రాష్ట్రంలోనే ప్రసిద్ధి గాంచిన ఈ ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు వైభవంగా కొనసాగనున్నాయి. కోయిలకొండ ఖిల్లా గుట్టపై బీబీ ఫాతీమా పీరుతో పాటు ఆశన్న, ఊషన్న పీర్లను ప్రతిష్ఠించారు. బీబీ ఫాతీమా పీరుతో పాటు మండల కేంద్రంలోని వీధుల్లో మొగులాలి, దాల్‌సాబ్, గండెల్‌సాబ్, సైద్‌అలి, ఇమాం ఖాసీం, ఉషాన్‌పాష, దాన్‌దూల పీర్లను ప్రతిష్ఠించారు. తొమ్మిది రోజుల్లో ఒక్కో రోజు ఒక్కో పీరు సవారు ఉంటుంది.

మొక్కులు..

కోయిలకొండ ఖిల్లాపై కొలువుదీరిన బీబీ ఫాతీమా పీరును బీమమ్మగా భక్తులు పిలుస్తారు. ఆమెను దర్శించుకొని, మొక్కులు చెల్లించుకుంటారు. కర్ణాటక, మహారాష్ట్రతో పాటు తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడికి వస్తారు. హైదరాబాద్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలొస్తారు. దట్టీలు, కందూర్లుతో మొక్కులు తీర్చుకుంటున్నారు. బీబీ ఫాతీమా పాటలతో ఆయా వీధుల్లో మహిళలు బొడ్డెమ్మ ఆడుతారు.

అమ్మకు సర్కారు చక్కెర

ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వ తరఫున తహసీల్దార్, గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు బీబీ ఫాతీమాకు చక్కెరను నైవేద్యంగా సమర్పిస్తారు. అనంతరం బీబీ ఫాతీమా పీరును ఊరేగింపునకు తరలిస్తారు. ఆమె పీరు ఖిల్లా కిందకు రాగానే అగ్ని గుండం నిర్వహిస్తారు.

కనువిందు చేయనున్న పీర్ల సవార్లు

ఉత్సవాల్లో పీర్ల సవార్లు కనివిందు చేస్తున్నాయి. శనివారం మొగులాలి పీరు సవారి జరిగింది. ఆదివారం ఇమాం ఖాసీం, సోమవారం ఉషన్‌పాష, దాన్‌దూల పీర్ల సవారి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. మంగళవారం అగ్నిగుండం, బీబీ ఫాతీమా, గండెల్‌సాబ్ పీర్లు సవార్లు, బుధవారం బీబీ ఫాతీమా పీరు ఊరేగింపుతో పాటు అన్ని పీర్లను నిమజ్జనం చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆకట్టుకునే సన్నివేశం

పీర్ల పండుగలో.. యుద్ధంలో బీబీ ఫాతీమా భర్త మొగులాలి మృతి చెందిన విషయాన్ని గండెల్‌సాబ్ పీరు బీబీ ఫాతీమా పీరుకు చెప్పడానికి వస్తుంటుంది. భర్త మరణ వార్త వినకూడదని ఆమె పీరు తప్పించుకొని వెళ్లడం ఆకట్టుకుంటుంది.

పటిష్ఠ బందోబస్తు

మొహర్రం ఉత్సవాల సందర్భంగా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. పార్కింగ్, సమాచార కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. చౌరస్తా నుంచి బైపాస్ రోడ్డు ద్వారా వాహనాలు ఉన్నత పాఠశాల వరకు వెళ్లాలని సూచించారు. ఆదివారం నుంచి అదనపు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేస్తామని చెప్పారు.



అతిథులొచ్చారు..



లక్ష్మీ సముద్రం చెరువు వద్ద విదేశీ పక్షులు



చెరువులో చేపలను తింటున్న పక్షులు

వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం తాడిపర్తి గ్రామ లక్ష్మీ సముద్రం చెరువుకు విదేశీ పక్షులు వలస వచ్చాయి. తెలుపు, నలుపు రంగులో ఉన్న ఈ పక్షుల కాళ్లు, ముక్కు పొడుగ్గా ఉన్నాయి. చెరువులో నీరు అడుగంటటంతో చేపలను, పురుగులను తింటున్నాయి. ఈ పక్షులను చూసి గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. 'శనివారం' కనిపించిన ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి

చెరువు గట్టున ఉన్న పక్షులు



నిబంధనలకు విరుద్ధంగా తరగతులు

- రూ.50 వేల చొప్పున విద్యా శాఖ జరిమానా



శ్లోక స్కూల్ ముందు ధర్నా చేపట్టిన ఏబీవీపీ నాయకులు

జడ్చర్ల, జూలై 13: విద్యా సంస్థలకు రెండవ శనివారం సెలవుదినంగా ప్రకటించినా, అందుకు విరుద్ధంగా తరగతులు నిర్వహించిన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని మూడు పాఠశాలలకు విద్యాశాఖ రూ.50 వేల చొప్పున జరిమానా విధించింది. పట్టణంలోని శ్లోక, పోలేపల్లి సెజ్‌లోని ఎస్‌వీకేఎం, జడ్చర్ల సమీపంలోని శ్రీస్వామినారాయణ గురుకుల పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా రెండో శనివారం తరగతులు నిర్వహించాయి. దీనిని నిరసిస్తూ పట్టణంలోని శ్లోక స్కూల్ వద్ద ఏబీవీపీ నాయకులు ధర్నా నిర్వహించారు. సెలవు రోజు తరగతులు నిర్వహించడంపై పాఠశాల యాజమాన్యంపై మండిపడ్డారు. ఇదే సందర్భంలో ధర్నాకు దిగిన ఏబీవీపీ నాయకులపైనా, కవరేజీకి వెళ్లిన విలేకరులపైనా పాఠశాల ప్రిన్సిపాల్ ప్రతిభ దురుసుగా వ్యవహరించడాన్ని వారు ఖండించారు. విషయం తెలుసుకున్న ఎంఈవో మంజులాదేవి పాఠశాలకు చేరుకుని, విచారణ చేపట్టారు. పట్టణంలోని మూడు పాఠశాలలు సెలవు రోజు తరగతులు నిర్వహించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారికి సమాచారం అందించారు. డీఈవో ఆదేశాల మేరకు శ్లోక, ఎస్‌వీకేఎం, స్వామినారాయణ గురుకుల పాఠశాలలకు ఒక్కో దానికి రూ.50 వేల చొప్పున జరిమానా విధిస్తూ నోటీసులు జారీ చేస్తున్నట్లు ఎంఈవో తెలిపారు. పాఠశాలల యాజమాన్యాలు డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డుకు జరిమానా చెల్లించాలని నోటీసులో పేర్కొన్నట్లు తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

- మానసిక స్థితి సరిగా లేకపోవడమే కారణం



చెన్నకేశవ రావు (ఫైల్)

అయిజ, జూలై 13: జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం ఉప్పలక్యాంపు గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చెన్నకేశవ రావు(24) శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మల్లికార్జునరావు, శారద దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్దవాడైన చెన్నకేశవరావు బీటెక్ చదివాడు. కొంతకాలం చెన్నైలో ఉద్యోగం చేశాడు. మానసిక స్థితి సరిగా లేకపోవడంతో చికిత్స కోసం స్వగ్రామానికి వచ్చాడు. చికిత్స పొందుతూ, అయిజ పట్టణంలోని ఉప్పల్‌దొడ్డిపేటలో చిన్నాన్న వద్ద ఉంటున్నాడు. ట్యాబ్లెట్స్ వేసుకోవాలని పలు మార్లు చెప్పినా నిర్లక్ష్యం చేసేవాడు. శనివారం తెల్లవారుజామున ఇంటి నుంచి వెళ్లి ఉప్పల రహదారిలో ఉన్న మంచినీటి సంప్ సమీపంలో చెట్టుకు తాడుతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ఊర్కొండ, జూలై 13: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని రాచాలపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. రాచాలపల్లి గ్రామానికి చెందిన షణ్ముఖ మల్లయ్య (49) మద్యం తాగి పొలం పనులకు వెళ్లకుండా ఖాళీగా తిరుగుతున్నావని భార్య మందలించింది. దాంతో మన స్తాపం చెంది శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు.

గుర్తించిన కుటుంబ సభ్యులు కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. దాంతో తిరిగి కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహానికి తీసుకువచ్చారు. భార్య నీలిమ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం చేసిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వడ్డేపల్లి, జూలై 13 : గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల పరిధిలోని పైపాడు గ్రామానికి చెందిన రాజేష్(28) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల, గ్రామస్థుల కథనం ప్రకారం.. పది రోజుల క్రితం కర్నూలు సమీపంలో ద్విచక్రవాహనంపై వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. కాగా, అక్కడి స్థానికులు 108కి సమాచారం ఇవ్వగా అతడిని చికిత్స నిమిత్తం కర్నూలులోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి రిమాండ్

వనపర్తి రూరల్, జూలై 13: బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నాగభూషణ్‌రావు శనివారం తెలిపారు. రెండు రోజుల క్రితం వనపర్తి మండలంలో ఖైలారం ఆంజనేయులు అనే వ్యక్తి 12 సంవత్సరాల బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా రూరల్ ఎస్ఐ జలంధర్ రెడ్డి కేసు నమోదు చేసి ఆంజనేయులను అరెస్టు చేశారు. సదరు వ్యక్తిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

ఖిల్లాఘణపురం, జూలై13: వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో శనివారం నిలిపిన ద్విచక్ర వాహనం చోరీకి గురైందని ద్విచక్ర వాహనదారుడు వెంకటేష్ తెలిపారు. బస్టాండ్ లో ఆవరణలో మొబైల్ దుకాణం నిర్వహిస్తున్న వెంకటేష్ శనివారం మధ్యాహ్నం భోజనం చేసి వచ్చిన అనంతరం బస్టాండ్ వెనుక భాగంలోని రావి చెట్టు కింద ద్విచక్రవాహాన్ని నిలిపాడు. మళ్లీ వచ్చి చూడగా వాహనం కనిపించలేదు. దాంతో పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. మండల కేంద్రంలో గతంలో బస్టాండ్ ముందు భాగంలో టీవీఎస్ వాహనంను సైతం చోరీ చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. బస్టాండ్ ఆవరణంలోని సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో తరచుగా చోరీలు జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

పీయూ వైస్ ప్రిన్సిపాల్‌కు విద్యారత్న జాతీయ పురస్కారం



పీయూ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణయ్యను సన్మానిస్తున్న ప్రముఖులు

పాలమూరు యూనివర్సిటీ, జూన్ 13: పాలమూరు యూనివర్సిటీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. కృష్ణయ్య విద్యారత్న జాతీయ పురస్కారం అందుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో భారతీయ లలిత కళా ఉత్సవ్ నిర్వహించారు. ముఖ్య అతిథులు కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి, నల్గొండ జిల్లా పుడమి సాహితి వేదిక అధ్యక్షుడు చిలుముల బాల్‌రెడ్డి, ఇండో కెనెడియన్ యూత్ కౌన్సిల్ కుమారి రొయ్యూరు అతిథులు హాజరై కృష్ణయ్యను సన్మానించి విద్యా రత్న జాతీయ అవార్డును అందజేశారు. పీయూ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూధన్‌రెడ్డి, పీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, రాజ్‌కుమార్, అధ్యాపకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

గంజాయి పట్టివేత

- ముగ్గురి అరెస్ట్..14 రోజుల రిమాండ్



గంజాయి కేసులో పట్టుబడిన వ్యక్తులు

మహబూబ్‌నగర్, జూలై13: ధూల్‌పేట నుంచి గంజాయి తీసుకువచ్చి పాలమూరు పట్టణంలో గంజాయి తాగేవారికి విక్రయిస్తూ కొందరు దందా సాగిస్తున్నారు. పోలీస్, ఎక్సైజ్‌శాఖ గంజాయి విక్రయాలు, గంజాయి తాగే వ్యక్తులపై కొద్దిరోజులుగా సీరియస్‌గా దృష్టిసారించింది. ఇందులో భాగంగానే పక్కా సమాచారంతో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ టీమ్ రామయ్యబౌళిలోని ఓ ఇంటిపై మూడురోజులుగా నిఘా ఏర్పాటు చేసింది. శనివారం ఉదయం ఆ ఇంట్లో దాడులు నిర్వహించగా 305 గ్రాముల ఎండుగంజాయి లభించింది. రామయ్యబౌళికి చెందిన నెత్తికొప్పుల హరిచందర్, షాషాబ్‌గుట్టకు చెందిన దుదావత్ రవికాంత్, కోయిలకొండకు చెందిన కడసాని శివలు ధూల్‌పేట నుంచి గంజాయి తీసుకువచ్చి పట్టణంలో గంజాయి తాగేవారికి విక్రయిస్తున్నారని తేలడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. న్యాయాధికారి ముందు హాజరుపరచగా 14 రోజులు రిమాండ్‌కు తరలించారు. ఈ తనిఖీలో జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ కవిత, ఎస్సై సునీత సిబ్బంది పాల్గొన్నారు.

సారా బట్టీలపై ఎక్సైజ్ దాడులు

- నలుగురిపై కేసు నమోదు



బెల్లం, పటికను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

లింగాల,జూలై 13: నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల పరిధిలోని రాయవరం గ్రామ శివారులో శనివారం సారా తయారు చేసే కేంద్రాలపై ఎక్సైజ్‌శాఖ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. దాడుల్లో 1500కిలోల నల్లబెల్లం, పది కిలోల పటికను, పదిలీటర్ల సారా లభ్యమైనట్లు ఎక్సైజ్ సీఐ రమణయ్య తెలిపారు. అదేవిధంగా 150 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశామన్నారు. ముకిడిగుండానికి చెందిన భాస్కర్, రాంబాబు, రాయవరానికి చెందిన వడ్డియా శ్రీను, కర్ణాటక రాష్ట్రం గురుమిట్కాల్‌కు చెందిన హన్మంత్‌నాయక్ పై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ఈదాడుల్లో ఎస్సై జనార్దన్, సిబ్బంది గోపాల్‌రెడ్డి, కృష్ణ, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

- ఒకరిపై కేసు నమోదు

పెద్దకొత్తపల్లి, జూలై 13 : బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం చంద్రకల్ గ్రామం నుంచి కోడేరుకు చెందిన పొడేండ్ల రవి తన బొలెరో వాహనంలో ఎనిమిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కోడేరుకు అక్రమంగా తరలిస్తుండగా దేవునితిర్మలాపూర్ గ్రామ సమీపంలోని కేఎల్ఐ ప్రధాన కాల్వ దగ్గర పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించగా సివిల్ సప్లయ్ గోదాముకు తరలించారు. సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రామ్మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్

కల్వకుర్తి, జూలై 13 : కల్వకుర్తి పట్టణంలోని స్టేడియం గ్రౌండ్‌లో జరుగుతున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ టోర్నమెంట్ శనివారం రెండవ రోజుకు చేరుకున్నాయి. రెండవ రోజు పోటీలను జడ్పీ మాజీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ హాజరై క్రీడాకారులను ప్రారంభించారు. క్రీడలు శారీరక దారుఢ్యం మానసిక వికాసానికి దోహదపడుతాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి భానుకిరణ్, సభ్యులు నగేష్, జగనంద్, కిశోర్, రాజేందర్, విజయభాస్కర్ తదితరులు ఉన్నారు.

స్పౌజ్ పాయింట్ల తప్పిదాలపై విచారణకు కమిటీ

- జిల్లాలో ఏడుగురు టీచర్లకు ఇప్పటికే షోకాజ్ నోటీసులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 13 : విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగం చేసిన టీచర్లకు ఇప్పటికే షోకాజ్ నోటీసులు ఇచ్చారు. తప్పు చేసిన వారి నుంచి వివరణ కూడా తీసుకున్న విద్యాశాఖ, వారు ఎప్పుడెప్పుడు స్పౌజ్ పాయింట్లు వాడుకున్నారు..? పాయింట్లను వినియోగించుకుంటే విద్యాశాఖ నిబంధనల ప్రకారం ఎనిమిదేళ్ల తర్వాత వినియోగించుకున్నారా లేదా అందులో కూడా తప్పులు చేశారా..? అన్న దానిపై సమగ్ర విచారణ చేపట్టేందుకు విచారణ కమిటీని మూడు రోజుల కిందట నియమించారు. జడ్చర్ల, మహబూబ్‌నగర్‌అర్బన్ మండలాల్లో జరిగిన స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీల బదిలీల్లో మొత్తం ఏడుగురు ఉపాధ్యాయులు తప్పుడు సమాచారం ఇచ్చి విద్యాశాఖను తప్పుదోవపట్టించారు. వీరిపై చర్యలు తీసుకునేందుకు పూర్తి వివరాలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. 'ఆంధ్రజ్యోతి'లో గత సెప్టెంబరు నుంచి జీహెచ్‌ఎంలకు సంబంధించి స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగంపై వరుస కథనాలు వస్తున్నాయి. అధికారుల విచారణ చేసి జీహెచ్‌ఎంలకు రెండు సార్లు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. మొత్తంగా ఏడుగురు జీహెచ్‌ఎంలు తప్పుడు సమాచారం ఇచ్చినట్లు గత గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల బదిలీల సమయంలో తేలినట్లు విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. అయితే వనపర్తి జిల్లాలోని ఖిల్లాఘణపురం మండల నుంచి మహబూబ్‌నగర్ జిల్లాకు బదిలీ పై వచ్చిన ఓ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడికి ఇంకా వనపర్తి జిల్లా అధికారి నోటీసులు ఇవ్వలేదని ఓ ఉపాధ్యాయ సంఘ నాయకుడు తెలిపారు. పలువురు జీహెచ్‌ఎంలను కాపాడేందుకు కొందరు పావులు కదుపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొత్తంగా ఈ తప్పిదాలు జరిగా పదినెలు కావస్తున్న పాఠశాల విద్యాశాఖ అధికారులు, రీజినల్ జాయింట్ డైరెక్టర్ జీహెచ్‌ఎంలపై చర్యలు తీసకునేందుకు కాలయపన చేస్తున్నారని కొని టీచర్స్ సంఘాలు విమర్శిస్తున్నాయి. విద్యాశాఖ నిబంధలన ప్రకారం చర్యలు తీసకుంటే మొత్తం 14 మందిపై వేటు పడే అవకాశం ఉన్నట్లు విద్యా శాఖ వర్గాలు చర్చించుకుంటున్నాయి. మొత్తంగా ఒక పాలమూరు జిల్లాలోనే ఇప్పటివరకు 22 మంది జీహెచ్‌ఎంలు , స్కూల్ అసిస్టెంట్స్ , ఎస్జీటీలు తప్పుడు సమాచారం ఇవ్వడంతో షోకాజ్ నోటీసులు ఇచ్చారు. దీనిపై డీఈవో రవీందర్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఇప్పటికే షోకాజ్ నోటీసులు ఇచ్చామని , ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు వచ్చే వారం చర్యలు ఉంటాయన్నారు. ఉద్యోగుల బదిలీల ప్రక్రియ జరుగుతున్నందున కొంత ఆలస్యం అవుతుందన్నారు.

నయా దందా

- పుట్టగొడుగుల్లా క్రీడా సంఘాలు
- జాతీయ, అంతర్జాతీయ టోర్నీల పేరిట పోటీలు
- గుర్తింపు లేని క్రీడల్లో పాల్గొని నష్టపోతున్న క్రీడాకారులు
- గుర్తింపు ఉన్న క్రీడలకే 'కోటా' వర్తింపు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ జూలై 13 : క్రీడలు మానసిక వికాసం, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయి. క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ప్రతిభ చాటితే ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతో పాటు క్రీడల్లో రాణించాలనే తపనతో ప్రోత్సహిస్తున్నారు. ఇదే అదునుగా జాతీయ, అంతర్జాతీయ టోర్నీల పేరిట గుర్తింపు లేని క్రీడా సంఘాలు పుట్టగొడుగుల్లా క్రీడాకారులను వంచిస్తున్నాయి. అమాయక క్రీడాకారులను ఆసరా చేసుకొని జాతీయ, అంతర్జాతీయ టోర్నీల పేరిట ధనార్జనే ధ్యేయంగా క్రీడాకారుల బంగారు భవిష్యత్తుతో ఆటలాడుతున్నాయి. ఎలాంటి ప్రయోజనాలుండని క్రీడా సర్టిఫికెట్లు అంటగట్టి తమ పబ్బం గడుపుకుంటున్నారు. ఉన్నతస్థాయి పోటీలు అనడంతో తల్లిదండ్రులు సైతం వేలల్లో వెచ్చిస్తున్నారు. ఇలా ఎందరో క్రీడాకారులు ఉమ్మడి జిల్లా నుంచి గుర్తింపు లేని సంఘాలు నిర్వహించే ఆటల పోటీల్లో పాల్గొని నష్టపోతున్నారు. ఆ టోర్నీల్లో సాధించిన పతకాలు, సర్టిఫికెట్లతో ఉన్నత విద్య ఉద్యోగాల్లో క్రీడా కోటా వర్తించదని తర్వాత తెలుసుకుని బాధపడుతున్నారు.

ఆకర్షణీయమైన ఆఫర్లతో ఎర

జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలు నిర్వహించి కొన్ని గుర్తింపు లేని సంఘాలు కొత్త దందాకు తెరలేపాయి. వేలాది రూపాయలు వసూలు చేసి క్రీడాకారులను మోసగిస్తున్నాయి. ఇటీవలే దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన అథ్లెటిక్స్ టోర్నీలో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సంఘానికి, ఈ టోర్నీకి ఒలింపిక్ సంఘం కాని, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి ఎలాంటి గుర్తింపు లేదు. నేపాల్‌లో ఖేలో భారత్ పేరిట ఓ అంతర్జాతీయస్థాయి క్రికెట్ టోర్నీతో పాటు అథ్లెటిక్స్ కరాటే, కబడ్డీ, సిలంబమ్, యోగా, ఫుట్‌బాల్, ఖోఖో, హ్యాండ్‌బాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, తైక్వాండో, వాలీబాల్, కిక్‌బాక్సింగ్ హాకీ, స్కేటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ టోర్నీ నిర్వాహకులు అమాయక క్రీడాకారులను తమ వైపు తిప్పుకునేలా ఆకర్షణీయమైన ఆఫర్లతో ఎర వేస్తున్నారు. ముందుగా టోర్నీలో ఆడేందుకు పేరు నమోదు చేసుకుంటే రాను పోను రైలు టిక్కెట్‌తో పాటు, వసతి సదుపాయం, పర్యాటక ప్రాంతాల సందర్శన అవకాశాలతో ఆకర్షించి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ టోర్నీకి ఒలింపిక్ భారత సమాఖ్య, బీసీసీఐ గుర్తింపు లేవు. ఉమ్మడి జిల్లా నుంచి క్రీడాకారులు వేలాది రూపాయలు ఇచ్చి ఆడుతున్నారు.

గుర్తింపు ఉన్న క్రీడలతోనే ప్రయోజనం



క్రీడాకారులు ఏ క్రీడ అంటే ఆ క్రీడలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు వెళ్లి మోసపోతున్నారు. చాలా క్రీడా సంఘాలకు గుర్తింపు ఉండదు. ఒలింపిక్ సంఘం, జాతీయ ఆయా క్రీడా సంఘాల ఫెడరేషన్ గుర్తింపు ఉన్న ఆటలు ఆడాలి. జిల్లాలోని క్రీడా సంఘాలు ఎన్నికలు నిర్వహించి తమకు రిపోర్టు చేస్తే ఆయా క్రీడా సంఘాలకు గుర్తింపు ఇస్తాం. కరాటేకు ఎలాంటి గుర్తింపు లేదు.

-ఎస్.శ్రీనివాస్, జిల్లా యువజన క్రీడల అధికారి మహబూబ్‌నగర్



షటిల్‌బ్యాడ్మింటన్ ఆడుతున్న దృశ్యం(ఫైల్)

క్రీడా సంఘాలకు గుర్తింపు తప్పని సరి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో తక్కువ క్రీడా సంఘాలకు మాత్రమే ఒలింపిక్ సంఘం, ఆయా క్రీడా సంఘాల ఫెడరేషన్ గుర్తింపు ఇచ్చింది. ఉమ్మడి జిల్లాలో వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్, ఖోఖో, హ్యాండ్‌బాల్, ఆర్చరీ, నెట్‌బాల్, బ్యాడ్మింటన్ తదితర క్రీడాంశాలకు మాత్రమే గుర్తింపు ఉంది. గుర్తింపు లేని క్రీడా టోర్నీలు ఆడితే సమయంతో పాటు డబ్బు వృథా చేసుకోవాల్సిందే.

కరాటే టోర్నీలతో నిలువు దోపిడీ

రాష్ట్రంలో, ఉమ్మడి జిల్లాలో కరాటేకు ఎలాంటి గుర్తింపు లేదు. పాఠశాలల్లో బాలికలకు ఆత్మరక్షణకు ఈ కరాటే నేర్పించేందుకు ప్రభుత్వం కొన్ని బాలికల పాఠశాలలను గుర్తించింది. చాలా మంది మాస్టర్లు క్లబ్‌లను ఏర్పాటు చేసుకుని పిల్లలకు కరాటే నేర్పించి జాతీయ, అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలకు తీసుకెళ్తున్నామని వేలల్లో వసూలు చేస్తున్నారు. ఈ సర్టిఫికెట్లు దేనికీ పనికి రావు. మహబూబ్‌నగర్‌లోని కొన్ని కరాటే క్లబ్‌ల మాస్టర్లు కరాటేలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలు సైతం నిర్వహిస్తుండటం గమనార్హం.

ఈడీ విచారణ జరిపించాలి

- రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న వి.హనుమంతరావు

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 13: అధిక వడ్డీ ఆశ చూపి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతుల నుంచి లక్షల పెట్టుబడులు పెట్టించుకుని మోసగించిన నాగర్‌కర్నూల్‌కు చెందిన సాయిరాం ఫైనాన్స్ వడ్డీ వ్యాపారి సాయిబాబాపై ఈడీ విచారణ జరిపించి బాధితులను న్యాయం చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. శనివారం నాగర్‌కర్నూల్‌కు వచ్చిన వి.హనుమంతరావు బాధితులతో కలిసి ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వడ్డీ వ్యాపారి సాయిబాబా చేసిన మోసం ఆంధ్ర తెలంగాణలో నాలుగు జిల్లాలకు విస్తరించిన దాదాపు రూ.100 కోట్ల స్కాం అన్నారు. వసూలు చేసి డబ్బులు ఎక్కడ ఉన్నాయో, ఏం చేశారో చెప్పకుండా వడ్డీ వ్యాపారి సాయిబాబు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సాయిబాబా ఫైనాన్స్‌లో పెట్టుబడులు పెట్టిన రైతులు అతను చేసిన మోసంపై ఎక్కడ తిరుగుతున్నా... తరబడి మొత్తుకుంటున్నా పట్టించుకునే నాథుడే లేడన్నారు. చివరకు చనిపోయిన జవాన్‌కు వచ్చిన డబ్బులను కూడా తన ఫైనాన్స్‌లో పెట్టుబడులు పెట్టించుకుని మోసం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. సాయిబాబా చేతిలో 1426 మంది రైతులు లక్షల్లో డబ్బులు పెట్టి మోసపోయారని పేర్కొన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియా మీద ప్రభుత్వం ఎలాగైతే ఉక్కుపాదం మోపుతుందో మోసపూరిత వడ్డీ వ్యాపారుల మీద కూడా అలాగే చర్యలు తీసుకోవాలన్నారు. సాయిబాబా చేతిలో మోసపోయిన రైతులు హైదరాబాదు ఇందిరాపార్కు వద్ద ధర్నా చేస్తుంటే తన దృష్టికి వచ్చిందని, బాధితులకు న్యాయం జరిగేదాకా పోరాటం చేస్తానని ఆయన అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు, బాధితులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

- భక్తిశ్రద్ధలతో యజ్ఞ ధ్వజ ప్రతిష్ఠాపన, సామూహిక హోమాలు



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 13: శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామిజీ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న శ్రీకృష్ణ కాలచక్ర 89వ విశ్వశాంతి మహాయాగంలో భాగంగా ఏడవ రోజు శనివారం శ్రీభూనీళా సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం, సామూహిక లక్ష్మీ నారాయణ హోమాలు నిర్వహించారు. తెల్లవారు జామున గోపూజ అనంతరం మహిళా భక్తుల చేత సామూహిక తులసి, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఒక వైపు యాగ మండపాల్లో రుత్వికులు శాస్త్రోక్తంగా వేద పారాయణం చేస్తుండగా మరోవైపు దంపతుల చేత శ్రీ సుదర్శన పాశుపత సహిత లక్ష్మీనారాయణ హోమాలు, నవగ్రహ హోమాలు చేశారు. సాయంత్రం యాగ మండపం వద్ద శ్రీకృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ చేతుల మీదుగా యజ్ఞ ధ్వజ ప్రతిష్ఠాపన చేశారు. సాయంత్రం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య శ్రీ భూనీళా సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. శనివారం సెలవు దినం కావడంతో ఆయుత చండీ అతిరుద్ర యాగశాల భక్తుల దర్శనం, సహపంక్తి భోజనశాల వద్ద భక్తుల రద్దీ అధికంగా కనిపించింది. కార్యక్రమంలో పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామివారి ఆశీర్వాదం తీసుకున్నారు.

వర్షానికి కూలిన ఇంటి పైకప్పు

వనపర్తి టౌన్, జూలై 13: వర్షానికి ఇంటి పైకప్పు కూలిన సంఘటన వనపర్తి జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. శనివారం పట్టణంలోని 21వ వార్డు హరిజనవాడలో ద్యారపోగు రాజన్న ఇంటి పెంకుల పైకప్పు కూలింది. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి శనివారం తెల్లవారు జామున ఇంటి పైకప్పు కూలినట్లు ఇంటి యజమాని రాజన్న తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ బావనిపల్లి వెంకటేష్ కూలిన రాజన్న ఇంటిని పరిశీలించారు. అదే సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, ఆస్తినష్టమే జరిగిందని తెలిపారు. విషయాన్ని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని, కౌన్సిలర్ మనోధైర్యం కల్పించారు. అదేవిధంగా ఇల్లు పాతది కావడంతో జాగ్రత్తగా ఉండాలని ఇంటి సభ్యులకు సూచించారు.

ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి కాపర్‌వైర్ చోరీ

భూత్పూర్, జూలై 13: విత్తన ప్రాసెసింగ్ యూనిట్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు పగులగొట్టి కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడి ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని కొత్తమొల్గర గ్రామ శివరులో ఉన్న వెంకటేశ్వర ప్రాసెసింగ్ యూనిట్ వద్ద ఈనెల 11వ తేదిన (గురువారం) రాత్రి గుర్తు తెలియని దుండగులు 63హెస్పవర్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి కాపర్ వైరు, ఆయిల్‌ను దొంగలించుకెళ్లినట్లు బాధితుడు గాల్‌రెడ్డి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుగా పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

గండీడ్ జూలై 13: ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన వనపర్తి జిల్లా గండీడ్ మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి . గండీడ్ మండల కేంద్రానికి చెందిన తమ్మలి రామచంద్రయ్య (50) ఇంటిలో ఎవరూ లేని సమయంలో తన ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

తెలకపల్లి, జూలై 13 : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల పరిధిలోని పెద్దూరులో విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. దీనికి సంబంధించి బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బీరం బాల్‌రెడ్డి అనే రైతుకు చెందిన ఎద్దుకు పక్కపొలంలో వేలాడుతున్న విద్యుత్ వైర్లు తాకడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. దీని విలువ దాదాపు లక్ష రూపాయల వరకు ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి తనకు ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

దాడికి యత్నం- పోలీసులకు ఫిర్యాదు

మిడ్జిల్, జూలై 13: ఇసుక ట్రాక్టర్‌ను అడ్డుకోయిన వ్యక్తిపై దాడికి యత్నించిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందింది. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం వాడియాల దుందుభీవాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం రావడంతో శుక్రవారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన రైతు మధు, మరి కొందరు యువకులు వాగువద్దకు వెళ్లి పరిశీలించారు. గ్రామ శివారులోని వేములకు వెళ్లే దారిలో ట్రాక్టర్‌ను అడ్డుకోబోగా తమ బైక్‌ను ఢీకొట్టినట్లు మధు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై బాలకృష్ణ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జడ్చర్ల రూరల్ సీఐ నాగర్జునగౌడ్ విచారణ చేపట్టారు.

గొర్రెలను ఎత్తుకెళ్లిన గుర్తు తెలియని దొంగలు

భూత్పూర్, జూలై 13: గ్రామ శివారులో ఆపిన గొర్రెల మందలో గుర్తు తెలియని దొంగలు చొరబడి గొర్రెలను ఎత్తుకెళ్లిపోయారు. ఈ సంఘటన భూత్పూర్ మండలంలో చోటు చేసుకుంది. బాధితులు ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తాటికొండ గ్రామానికి చెందిన జెట్టెం సాయిలు, కప్పెట బీరప్ప, దులే బైడయ్యకు చెందిన దాదాపుగా 1000 గొర్రెలు ఉంటాయి. వీటిల్లో 30గొర్రెలను శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు వాహనంలో ఎక్కించుకొని పారిపోయినట్లుగా బాధితులు పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సంఘటన స్థలాన్ని భూత్పూర్ ఎస్ఐ చంద్రశేఖర్ పరిశీలించారు.

బుద్దారంలో..

గోపాల్‌పేట : వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం బుద్దారం గ్రామంలో 30 పొట్టేలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించినట్లు ఎస్సై హరిప్రసాద్ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పుణ్యక్షేత్రాలకు బస్సులు కరువు

- తిరుపతికి వెళ్లాలంటే ఎర్రవల్లిలో బస్సు ఎక్కాలి
- శ్రీశైలానికి ఎక్స్‌ప్రెస్ స్థానంలో లగ్జరీ బస్సు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహిళా ప్రయాణికులు

గద్వాల అర్బన్, జూలై 13 : ఓ వైపు ప్రయాణికులకు సేవలు విస్తరించడంతో పాటు పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడుపుతూ అదనపు ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా ఆర్టీసీ చర్యలు చేపడుతోంది. కానీ, గద్వాల ఆర్టీసీ డిపో అధికారులు మాత్రం తెలుగు రాష్ట్రాలోని పుణ్యక్షేత్రాలకు వెళ్లే బస్సులను సైతం అర్ధాంతరంగా రద్దు చేస్తూ, తమదైన పద్ధతిని అనుసరి స్తున్నారు. గద్వాల డిపో ఏర్పడిన కొత్తలో ప్రతీ రోజు ఉదయం 6గంటలకు యాదగిరి గుట్టకు వెళ్లి వచ్చే బస్సును నాలుగేళ్ల క్రితమే రద్దు చేసిన అధికారులు ఇప్పటి వరకు దాని పునరుద్ధరణ గురించి పట్టించుకోలేదు. యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహా ఆలయాన్ని వందల కోట్ల రూపాయలు వెచ్చించి యాదాద్రిగా పేరు మార్చి రెండవ తిరుపతిగా అభివృద్ధి చేయగా రాష్ట్రంలోని అన్ని డిపోల నుంచి బస్సులు నడుపుతున్నా గద్వాల డిపో అధికారులు ఆ దిశగా మళ్లీ ప్రయత్నం చేయకపోవడం గమనార్హం. దీంతో పాటు ఈ ప్రాంతం నుంచి ఇంద్రకీలాద్రిపై వెలసిన అమ్మవారిని దర్శించుకునే భక్తులకు అనువుగా గతంలో నడిపిన విజయవాడ బస్సును సైతం ఇదే రీతిలో నిలిపివేశారు. ఇక శ్రీశైలానికి గద్వాల నుంచి ప్రతీరోజు వెళ్లే ఎక్స్‌బస్సు స్థానంలో సూపర్ లగ్జరీ బస్సు ప్రవేశ పెట్టడంతో మహిళలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న ఆరు గ్యారెంటీల్లో ప్రస్తుతం అమలవుతున్న ఏకైన గ్యారెంటీ పథకం ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మాత్రమే ఉండగా శ్రీశైలం వెళ్లే బస్సు సూపర్ లగ్జరీ కావడంతో మహిళలకు ఉచిత ప్రయాణ అవకాశం కరువైంది. అలాగే గద్వాల నుంచి ప్రతీరోజు రెండు ట్రిప్పులు మంత్రాలయం పుణ్యక్షేత్రానికి వెళ్లి వచ్చే బస్సును నెల రోజుల క్రితం డిపో అధికారులు అర్ధాంతరంగా రద్దు చేశారు. దాంతో ప్రయాణికుల నుంచి ఆర్టీసీ అధికా రులపై ఒత్తిడి పెరగడంతో తిరిగి ఆ సర్వీసును పునరు ద్ధరించిన అధికారులు దాన్ని ఎంతవరకు సక్రమంగా నడుపుతారోనని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇక గద్వాల నుంచి తిరుపతికి వెళ్లే బస్సును నేరుగా గద్వాల నుంచి తిరుపతికి కాకుండా డిపో నుంచి తొలుత హైదరాబాద్‌కు వెళ్లి అక్కడి నుంచి ఎర్రవల్లి చౌరస్తా, కర్నూలు మీదుగా తిరుపతికి నడుపుతుండటం ఒక విచిత్ర ప్రయోగం. గద్వాలకు చెందిన తిరుపతి ప్రయాణికులు తిరుమల వెళ్లాలంటే గద్వాల బస్సు కోసం ఇక్కడి నుంచి 17 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎర్రవల్లి చౌరస్తాకు వెళ్లి ఎదురుచూడాల్సి వస్తుండటం ప్రయాణికు లకు శాపంగా మారింది. దీంతో కర్నూలుకు వెళ్లి అక్కడి నుంచి తిరుపతికి రిజర్వేషన్లు చేసుకుంటుండం గమ నార్హం. సంబంధిత అధికారులు ప్రయాణికుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని డిపో నుంచి నేరుగా పుణ్యక్షేత్రాలను బస్సులు నడపాలని కోరుతున్నారు.

శ్రీశైలానికి ఎక్స్‌ప్రెస్ బస్సు నడపాలి



శ్రీశైలానికి గద్వాల డిపో నుంచి గతంలో మాదిరిగానే ప్రతీరోజు ఉదయం 5.30గంటలకు ఎక్స్‌ప్రెస్ బస్సును నడపాలి. లగ్జరీ బస్సులో ప్రభుత్వం ఇచ్చిన ఉచిత ప్రయాణ అవకాశం లేకపోవడం వల్ల మాలాంటి మధ్య తరగతి వారికి పుణ్యక్షేత్రానికి వెళ్లేందుకు ఆర్థికంగా భారం అవుతుంది. ప్రయాణికులు అదనంగా ఉండి వారు కోరితే లగ్జరీ బస్సు నడవవచ్చు.

- మాధవి, ప్రయాణికురాలు, గద్వాల

అన్ని పుణ్యక్షేత్రాలకు సర్వీసులు నడపాలి



గతంలో మాదిరిగానే యాదాద్రి, విజయవాడ, తిరుపతి, శ్రీశైలం, మంత్రాలయం, పుణ్యక్షేత్రాలకు రెగ్యులర్‌గా సర్వీసులు నడపాలి. వీటితో పాటు ఈ ప్రాంతం నుంచి బందే నవాజ్ దర్గాను సందర్శించే భక్తుల కోసం కర్ణాటక లోని గుల్బార్గాకు బస్సును నడపాలి. చారిత్రక నగ రంగా పేరున్న హోస్పేటకు కూడా సర్వీసు నడు పుతామని అధికారులు హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదు.

- హలీం, గద్వాలవాసి



గద్వాల ఆర్టీసీ బస్ డిపో

లొద్ది మల్లయ్య దర్శనానికి అనుమతి ఇవ్వాలి

- ఫారెస్ట్ అధికారులకు బజరంగ్ దళ్ వినతి



ఫారెస్టు అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న బజరంగ్‌దళ్ సభ్యులు

అచ్చంపేట, జూలై 13: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 17న జరిగే లొద్దిమల్లయ్య ఉత్సవాలకు అనుమతులు ఇవ్వాలని బజరంగ్‌దళ్ డివిజన్ సభ్యుడు శివ.చందులాల్ చౌహాన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ఫారెస్ట్ కార్యాలయంలో ఐఎఫ్ఎస్ అధికారి సుశాంత్ బోబ్డేకు వినతి పత్రం అందజేశారు. తొలి ఏకాదశి సందర్భంగా నల్లమలలో వెలసిన లొద్ది మల్లయ్యను దర్శించుకోవడం ఈ ప్రాంత భక్తుల సంప్రదాయంగా కొనసాగుతూ వస్తుంది. గత మూడేళ్లుగా అటవీ శాఖ అధికారులు అనుమతులు ఇవ్వకపోవడంతో భక్తులు అసహనం వ్యక్తమవుతూ వచ్చింది. ఈ క్రమంలో అటవీశాఖ అధికారులు భక్తుల మనోభావాలు దెబ్బ తీయకుండా అనుమతించాలని కోరడంతో అధికారులు ఒక్కరోజు అనుమతులు ఇచ్చే అంశంపై ఉన్నతాధికారులు చర్చించుకుంటున్నట్లు తెలుస్తున్నది. ఈ కార్యక్రమంలో బజరంగ్‌దళ్ సభ్యులు శివాజీ, నరేష్, అమర్, రాము పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు



పెద్దకొత్తపల్లిలో ప్రతిష్ఠించిన పీర్లు

పెద్దకొత్తపల్లి, జూలై 13 : మండలంలోని వివిధ గ్రామాల్లో మొహర్రం వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. పెద్దకొత్తపల్లి, పెద్దకార్పాముల, చిన్నకొత్తపల్లి, యాపట్ల, ముష్టిపల్లి, కల్వకోల్ తదితర గ్రామాల్లో పీర్ల చావిడిల్లో భక్తి శ్రద్ధలతో పీర్లను ప్రతిష్ఠించారు. ప్రతిరోజు సాయంత్రం వేళల్లో కులమతాలకతీతంగా పిల్లలు, పెద్దలు, మహిళలు పీర్ల చావిడి దగ్గరికి చేరుకుని తిలకిస్తారు.

జూపల్లిలో కొలువు దీరిన పీర్లు

చారకొండ, జూలై 13: మొహర్రం పండుగ సందర్భంగా మంలంలోని జూపల్లిలో శనివారం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పీర్ల చావిడి వద్ద అలంకరంగా చేసి ప్రత్యేక ప్రార్థనలు చేసి పీర్ల చావడిలో పీర్లను ఏర్పాటు చేశారు. వారం రోజుల పాటు మొహర్రం వేడుకలు నిర్వహించనున్నారు. 14న చిన్న సరిగెత్తు, 16న పెద్ద సరిగెత్తు వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొని పీర్ల పండుగ వేడుకలను విజయవంతం చేయాలని నిర్వాహకులు తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్



మందుల అమ్మకందారుల సంఘం నూతన భవనానికి శంకుస్థాపన చేస్తున్న మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్

కల్వకుర్తి, జూలై 13 : పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ తెలిపారు. కల్వకుర్తి పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో ఎమ్మెల్యే నిధులు రూ. 8లక్షలతో మందుల అమ్మకందారుల సంఘం భవన నిర్మాణానికి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ స్థానిక నాయకులతో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సహ కారంతో కల్వకుర్తి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చడమే లక్ష్యంగా ముందు కు సాగడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎస్సీ కమ్యూనిటీహాల్‌ను పరిశీలించారు.

ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ నిధుల నుంచి రూ.65లక్షలు మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. స్థానిక కౌన్సిలరు నేరటి పద్మ, చిన్నా, గోరటి శ్రీనివాసులు, మార్కెట్ మాజీ డైరెక్టర్ షానవాజ్‌ఖాన్, షాకీర్, మబ్బు రామరాజు, చిత్తారి శ్రీను, మాజీ సర్పంచ్‌లు జిల్లెల రాములు, దామోదర్‌గౌడ్, మందుల సంఘం నాయకులు ఈశ్వర్, పడకంటి వెంకటేష్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

మద్దిమడుగు ఆర్టీసీ బస్సుకు స్వాగతం పలికిన నాయకులు



ఉమ్మాపూర్‌లో ఆర్టీసీ బస్సుకు స్వాగతం పలుకుతున్న నాయకులు

వంగూరు, జూలై 13: భక్తుల సౌకర్యార్థం మద్దిమడుగుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించడం ఎంతో సౌకర్యంగా ఉందని మాజీ సర్పంచులు సుధాకర్‌రావు, వెంకట్ రెడ్డి అన్నారు. కల్వకుర్తి నుంచి వయా కొండారెడ్డిపల్లి, పోల్కంపల్లి, చౌదర్‌పల్లి, ఉమ్మాపూర్, గాజర, డిండి మీదుగా మద్దిమడుగుకు బస్సుసౌకర్యం కలల్పించడంతో శనివారం నాయకులు, అయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు ఆర్టీసీ బస్సుకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బస్సు సౌకర్యానికి కృషి చేసిన అచ్చంపేట, కల్వకుర్తి ఎమ్మెల్యేలు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డి, ఆర్టీసీ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి, బాలస్వామి, శ్రీను, రామచంద్రం, ఎద్దుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొత్త శ్రీధర్‌రావు ఎన్నిక



సమావేశంలో పాల్గొన్న ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 13: రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొత్త శ్రీధర్‌రావు ఎన్నికయ్యారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఎస్.మురళి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శ్రీధర్‌రావును ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎస్.మురళి మాట్లాడుతూ జిల్లా ప్రధాన కార్యదర్శి పని చేసిన ఎం.సుదర్శన్ పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో ప్రస్తుతం జిల్లాలోని బల్మూరు జడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కొత్త శ్రీధర్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోకల సతీష్, రాష్ట్ర అదనపు కార్యదర్శి ఎస్.ఈశ్వర్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు సత్యనారాయణ, హనుమంత్‌రెడ్డి, జిల్లా నాయకులు మధుసూదన్‌రెడ్డి, కె.సురేష్‌బాబు, బాలస్వామి రాజేష్, రామేశ్వర్‌రావు, కరుణాకర్‌రెడ్డి, వెంకటస్వామి, శ్రీనివాసాచార్యులు, నరసింహ, నారాయణ, జమీల్ పాషా, జహంగీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

వరుస ప్రమాదాలు.. ఆపేదెలా?

- రాత్రి పూట కనిపించని సూచిక బోర్డులు
- చిన్న డ్యామేజీకి రూ. వేలల్లో వసూళ్లు

అచ్చంపేట, జూలై 13: హైదరాబాద్ శ్రీశైలం 765 జాతీయ రహదారిపై నిర్మించిన స్పీడ్ బ్రేకర్స్ వద్దే వరుస ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. స్పీడ్ బ్రేకర్ల వద్ద సరైన సూచికతో కూడిన రేడియం స్టిక్కర్స్ లేక పోవడం వల్లనే వరుస సంఘటనలు జరుగుతున్నాయని పలువురు వాహనదారులు వాపోతున్నారు.

అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని బ్రాహ్మణపల్లి



చెన్నారం స్టేజీ హైదరాబాద్ శ్రీశైలం 765 జాతీయ రహదారిపై నిర్మించిన స్పీడ్ బ్రేకర్లు

నుంచి లత్తీపూర్ వరకు జాతీయ రహదారి వెంబడి 9 చోట్ల ఆయా స్టేజీల వద్ద స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేశారు. స్పీడ్ బ్రేకర్ల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు లేక పోవడంతో రాత్రి వేళల్లో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. జాతీయ రహదారి కావడంతో నిత్యం వేలాది వాహనాలు వస్తూ పోతూంటాయి.



హైదరాబాద్ శ్రీశైలం 765 జాతీయ రహదారి హాజీపూర్ వద్దపై నిర్మించిన స్పీడ్ బ్రేకర్లు

నియోజకవర్గ పరిధిలోని బ్రాహ్మణపల్లి, చంద్రసాగర్, హాజీపూర్ చౌరస్తా, చెన్నారం, పీరట్వానిపల్లి, అయ్యవారిపల్లి, వెలటూరు, ఈరట్వానిపల్లి, లత్తీపూర్ స్టేజీల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. కానీ ఈ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు ఉన్న సంగతి స్థానిక వాహనదారులకే తెలుసు కనుక అక్కడ మెల్లగా వెళుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులకు స్పీడు బ్రేకర్ ఉన్నవిషయం తెలియక స్పీడుగా వచ్చి వారి ముందు ఉన్న వాహనాన్ని ఢీకొడుతున్నారు. దీంతో స్థానికంగా నడిచే వాహనాలు డ్యామేజవుతున్నాయి. ఇదే అదనుగా కొందరు ఇతరప్రాంతాల నుంచి వచ్చి స్థానిక వాహనాలను ఢీకొంటే.. స్వల్పంగా దెబ్బతిన్నా పెద్దమొత్తంలో డబ్బులు రాబట్టుతున్నట్లు తెలుస్తుంది. బాధిత వాహనదారులు ఎందుకొచ్చిన కర్మ అని పోలీసు కేసు కాకుండా పని అయిపోతుందని వారు అడిగిన కాడికి ఇచ్చుకొంటున్నట్లు తెలుస్తున్నది. ప్రధానంగా రాత్రి వేళలోనే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకొంటున్నాయి. ఇప్పటికైనా జాతీయ రహదారి అధికారులు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

వైద్యం, విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

-ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేటటౌన్, జూలై 13: నల్లమల ప్రాంత ప్రజలకు వైద్యం, విద్య అందిచడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. అచ్చంపేట పట్టణంలోని ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలో మెగా సర్జికల్ క్యాంపు చివరి రోజు శనివారం ఆసుపత్రి సూపరింటిండెంట్ ప్రభుతో కలిసి నిర్వహించారు. ఆసుపత్రిలో శస్త్ర చికిత్సల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నల్లమల ప్రాంత ప్రజలు అన్ని విధాల ఉచిత వైద్యం అందించడమే లక్ష్యమన్నారు. మెగా సర్జికల్ క్యాంపు ఏర్పాటు చేయడం వల్ల నియోజకవర్గంలో అన్ని రకాల వ్యాధులకు 1230 దరఖాస్తులు అందాయన్నారు. అందులో మేజర్ కేసులు గుర్తించి అవసరమైన వారికి ఆపరేషన్లు చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ప్రధానంగా వైద్యం, విద్యను అందించాలని ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఇంకా ఎవరైన ఆరోగ్య సమస్యలు ఉంటే దరఖాస్తులు చేసుకోవాలని వారికి వచ్చే క్యాంపులో చికిత్సలు అందిస్తామన్నారు.

మొత్తం 13 మంది స్పెషలిస్టు డాక్టర్లచే ఆపరేషన్లు చేశామన్నారు. ప్రధానంగా సమస్యలు ఉన్న రోగులకు వైద్యం అందించినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి క్యాంపు మూడు నెలలకు, ఆరు నెలలకు ఒకసారి నిర్వహించి నల్లమలలో ప్రజలకు వైద్యం అందిస్తామన్నారు. మరికొన్ని రోజుల్లో ఆసుపత్రిలో సిటీ స్కానింగ్‌తో పాటు బ్లడ్ బ్యాంక్‌తో అన్ని రకాల చికిత్సలకు పరికరాలతో పాటు సిబ్బందిని నియమించి వైద్యం అందిస్తామన్నారు. ఈ నెల 20 మెగా కార్డియాక్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

ఈ క్యాంపులో కార్డియాక్ క్యాంపులో హార్ట్, న్యూరో, హార్థోపెడిక్‌లకు సంబంధించిన క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. జనరల్ సర్జన్లు రామచందర్, మహేష్, బాల్‌సింగ్, వైద్యసిబ్బంది ఉదయ్, హరిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పదు

లింగాల: ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదని విధుల పట్ల అంకిత భావంతో పని చేసినప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. లింగాలకు చెందిన ఉపాధ్యాయుడు ఖాత్రావత్ రాజునాయక్ ఇటీవల పదవీ విరమణ పొందగా శనివారం మండల కేంద్రంలో సన్మానసభ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో పాటు ఖమ్మం జిల్లా వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన రాజునాయక్ దంపతులను ఘనంగా సన్మానించారు. పలువురు ఉద్యోగ సంఘ నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చెంచుల సమస్యలు పరిష్కరించాలి

- రేపు కొల్లాపూర్ ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా

పెద్దకొత్తపల్లి, జూలై 13 : మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో ఆదివాసీ చెంచులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.అశోక్, సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.దశరథంలు డిమాండ్ చేశారు. నల్లమల అటవీ తీర ప్రాంతంలోని ఆదివాసీ చెంచులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15న కొల్లాపూర్ ఆర్డీవో కార్యాలయం ముందు తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. తీర్నాంపల్లి చెంచుకాలనీలో కొత్త పెళ్లైన జంటలకు ఇళ్లు, ఇంటి స్థలాలు లేవని, రేషన్‌కార్డులు, తాగడానికి భగీరథ నీరు సరఫరా కావడం లేదని చేతి పంపులను ఆశ్రయించి ఆ నీటిని తాగుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో విష జ్వరాలు ప్రబలుతున్నా ఏఎన్ఎంలు, డాక్టర్లు కూడా రావడం లేదని చెంచులు తమ ఆవేదన వ్యక్తం చేశారని వారు తెలిపారు. గ్రామపంచాయతీ కార్యదర్శి అచ్చంపేట నుంచి నెలకొకసారి వస్తుపోతూ ఉంటారని వచ్చినా సమస్యలను పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. ఏమైనా వని ఉంటే మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లికి వచ్చి వెళ్లిపోతుంటాడని, ఆదివాసీ చెంచులు తమ దృష్టికి తీసుకొచ్చారని వారు తెలిపారు. గ్రామంలో వీధి లైట్లు లేక రాత్రివేళల్లో బయటకు వెళ్లాలంటే విషసర్పాల భయంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని తిరుగుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలంగాణ గిరిజన సంఘం నాయకులు పేర్కొన్నారు. గ్రామ సమస్యలపై ఫోన్ చేసినా పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న గ్రామపంచాయతీ కార్యదర్శిపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు. మారేడుమానుదిన్నె గ్రామ చెంచుకాలనీలోని చెంచులు చాలా మంది వలసలు వెళ్లారని కాట్రాజ్ నరసింహ 60సంవత్సరాలు ఉన్నప్పటికీ జీవన భృతి కోసం వలస వెళ్లలేక మంచం మీద పడ్డాడని అతనికి ఎవరూ లేక తన తమ్ముడు పెంచి పోషిస్తున్నాడని చెంచులు ఆవేదన వ్యక్తం చేసినట్లు గిరిజన సంఘం నాయకులు పేర్కొన్నారు. అధికారులు ఆదివాసీ చెంచులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు.



మారేడుమానుదిన్నె గ్రామంలో చెంచుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న గిరిజన, సీఐటీయూ నాయకులు

గర్ల్స్ హాస్టల్‌కు గ్రీన్ సిగ్నల్

- వచ్చే బడ్జెట్‌లో రూ.5.35 కోట్లు కేటాయింపునకు కళాశాల విద్యా కమిషనర్ దేవసేన హామీ
- అత్యుత్తమ విద్యా కేంద్రంగా పాలెం డిగ్రీ కళాశాల శ్రీకారం
- కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యారాణి

బిజినేపల్లి, జూలై 13 : వచ్చే విద్యా సంవత్సరంలో డిగ్రీ కళాశాల్లో చదివే విద్యార్థినుల కోసం గర్ల్స్ హాస్టల్ నిర్మాణం చేపట్టాలని అందుకు అవసరమైన రూ.5.35 కోట్లు విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర కళాశాల కమిషనర్ దేవసేనను కోరగా వెంటనే వచ్చే బడ్జెట్‌లో కేటాయింపులు చేస్తానని హామీ ఇచ్చినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. విద్యారాణి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెంలోని శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఈ మధ్యనే స్వయం ప్రతిపత్తి హోదా ప్రకటించడంతో అందుకు సహకరించిన తెలంగాణ రాష్ట్ర కళాశాల విద్యా కమిషనర్ దేవసేనను, మల్టిజోనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ డీఎస్ఆర్ రాజేంద్ర సింగ్, యాదగిరిలను శనివారం ఉదయం కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లు ఆమె తెలిపారు.



తెలంగాణ రాష్ట్ర కళాశాల విద్యా కమిషనర్ దేవసేనను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ విద్యారాణి, కళాశాల సిబ్బంది

గతంలో పాలెం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా చేసిన మల్టీ జోనల్ ఉన్నత విద్యా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ డీఎస్ఆర్ రాజేందర్ సింగ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించేందుకు రూసా నిధులతో అదనపు తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, ఆడిటోరియంలతో పాటు కళాశాలకు ప్రహరిని నిర్మాణం చేపట్టి కళాశాలను సుందరంగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. కళాశాలకు అటానమస్ కోసం చాలా కాలంగా ప్రయత్నం చేస్తున్నామని అందరి సహకారంతో స్వయం ప్రతిపత్తి సాధించుకున్న కళాశాల సిబ్బంది, గ్రామస్థులు విద్యార్థులకు ఉత్తమ వసతులు కల్పించి మరింత అభివృద్ధికి పాటుపడాలని కోరారు.

డిగ్రీ కళాశాల ఆవరణలో రూ.5.35 కోట్లతో హాస్టల్ నిర్మాణానికి కమిషనర్ దేవసేన నిధులు విడుదల చేస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు, పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఆమె వెంట కళాశాల లైబ్రేరియన్ కృష్ణయ్య, అధ్యాపకులు డాక్టర్ నాగరాజు, శివ, యాదగిరి, మనోజ్ కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రజాపాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ, జూలై 13 : అన్నివర్గాల అభ్యున్నతికి ప్రజాపాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని గుండాల అంబారామలింగేశ్వరస్వామి దేవాలయ నూతన కమిటీ ఛైర్మన్ మల్లేపల్లి సందీప్‌రెడ్డితోపాటు సభ్యులను ఏఐసీసీ కార్యదర్శి సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు సభ్యుడు బాలాజీసింగ్‌లతో కలిసి ఎమ్మెల్యే శాలువాలు, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలు, దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు దాతలు సహకరించాలని కోరారు. రాష్ట్రంలో పని చేసే ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలన్నారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు అస్తవ్యస్తంగా మారాయని, నియోజకవర్గంలో బీజేపీకి క్యాడర్‌లేదని విమర్శించారు. ఇచ్చిన హామీలను తప్పక అమలు చేస్తామని తెలిపారు. కేఎల్ఐలో భూములు కోల్పోయిన వారికి అందరికి పరిహారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధికి అన్నివిధాలుగా సహకరిస్తామని తెలిపారు. ప్రజలకు సేవచేసే ప్రభుత్వం మీముందుందని వంశీచంద్‌రెడ్డి పేర్కొన్నారు. నాయకులు భూపతిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మోతీలాల్, పర్వత్‌రెడ్డి, జయప్రకాష్, వెంకటయ్యగౌడ్, విజయ్‌కుమార్‌రెడ్డి, నర్సింహ, సంజీవ్‌కుమార్, ఆశాదీప్‌రెడ్డి, సాంబయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, వంశీచంద్‌రెడ్డి, బాలాజీసింగ్

సమాజ హితం కోసం సీసీ కెమెరాలు అవసరం

ఊర్కొండ, జూలై 13: సమాజ హితం కోసం సీసీ కెమెరాల ఏర్పాటు అవసరమని కల్వకుర్తి సీఐ నాగార్జున అన్నారు. శనివారం మండలంలోని ఊర్కొండపేట గ్రామ పంచాయతీ ఆవరణలో సీసీ కెమెరాల ఆవశ్యకత, సైబర్ నేరాల పట్ల గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని వాటి వల్ల మానసికంగా, శరీరకంగా ఇబ్బందులకు గురవుతారని అన్నారు. డ్రగ్స్ వాడినట్లు తెలిస్తే చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు అవసరమని తెలిపారు. కాంగ్రెస్ యువజన విభాగం మాజీ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి, నాయకులు వహీద్, ఖైసర్, ఫైబాజ్, కృష్ణ, అంజయ్య గౌడ్, మల్లేష్, జహీర్, శ్రీను, అరవింద్ గౌడ్ పోలీసు సిబ్బంది మల్లేష్ తిరుపతి తదితరులు ఉన్నారు.



ఊర్కొండపేటలో సీసీ కెమెరాల ఆవశ్యకతను తెలియజేస్తున్న సీఐ నాగార్జున

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌ను సన్మానించిన ఎమ్మెల్యే



శివసేనారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి

కల్వకుర్తి, జూలై 13 : తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా నియమితులై పదవీ బాధ్యతలు స్వీకరించిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డిని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి సత్కరించారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో క్రీడాకారులకు మెరుగైన సదుపాయాలు అందేలా చూడాలని కోరడం జరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

తెలకపల్లి, జూలై 13 : విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని సీఎల్ఆర్ విద్యా సంస్థ కరస్పాండెంట్ వి.రాజమహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సీఎల్ఆర్ విద్యా సంస్థల్లో చదువుతున్న ఆర్టీరెడ్డి సహకార జూనియర్ కళాశాల, గోవర్ధన్‌రెడ్డి డిగ్రీ కళాశాల విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్య, కలికులం, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలని సూ చించారు. ఈ సందర్భంగా పాటల పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు మర్యాద ప్రకాశ్‌రెడ్డి, ఎస్.నందీప్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంబీ చర్చి నూతన కార్యవర్గం ఎన్నిక



సీఎంబీ చర్చి నూతన కార్యవర్గ సభ్యుల బృందం

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 13: జిల్లా కేంద్రంలోని సీఎంబీ చర్చి నూతన కార్యవర్గం ఏర్పడింది. శనివారం చర్చి సర్వసభ్య సమావేశంలో ఎన్నికల అధికారులు, టెరిటోరియల్ డైరెక్టర్ సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీఎంబీ చర్చి చైర్మన్‌గా పీ.ఈ.సంపత్‌కుమార్, వైస్ చైర్మన్‌గా డీ.ఎస్.సామ్యూల్, సెక్రెటరీగా ఎన్‌డీ దినకర్, ట్రెజరర్‌గా పీడబ్ల్యూ సైమన్, ఈసీ సభ్యులుగా ఈడీ.విశ్వప్రసాద్, కె.సాంసన్, టీఎన్.సంపత్‌కుమార్, కె.సునీల్‌రాజ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ పీ.ఈ.సంపత్ కుమార్ మాట్లాడుతూ సీఎంబీ చర్చిని ఆధ్యాత్మికంగా ముందుకు నడిపించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. సీఎంబీ చర్చి పాస్టర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవకే ఐక్యత ఫౌండేషన్ ప్రాధాన్యం



కంటివైద్య శిబిరం వాల్‌పోస్టర్ విడుదల చేసిన రాఘవేందర్‌రెడ్డి, సభ్యులు

వెల్దండ, జూలై 13 : నిరుపేద వర్గాలకు ప్రజాసేవ చేసేందుకు ఐక్యత ఫౌండేషన్ ప్రాధాన్యతనిస్తుందని చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 19 నుంచి పది రోజులపాటు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెన్నై శంకర నేత్రాలయం వారి సహకారంతో ఏపీఆర్ గార్డెన్‌లో నిర్వహించే మెగా కంటివైద్య శిబిరం వాల్‌పోస్టర్‌ను రాఘవేందర్‌రెడ్డి సంస్థ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరంలో కంటి శుక్లాలు ఉన్నవారికి ఉచితంగా ఆపరేషన్‌లు మొబైల్ వాహనాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా అవసరమైన వారిని గుర్తించి కంటి అద్దాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి, రమేష్‌నాయక్, మహేష్, రాహుల్, శేఖర్, అంజి, పంతుల, వెంకటరెడ్డి, కొండల్, శివ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వెల్దండ, జూలై 13 : ఇటీవల మృతిచెందిన మండలంలోని చెర్కూర్ గ్రామానికి చెందిన గొడుగు చంద్రయ్య కుటుంబాన్ని శనివారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మెన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులను ఓదార్చారు. అనంతరం కుటుంబానికి వ్యక్తిగతంగా 10 వేల ఆర్థికసాయం అందజేశారు. అంతకుముందు చంద్రయ్య చిత్రపటం వద్ద ఆయన నివాళులర్పించారు. మృతుని పిల్లల చదువులకు తనవంతుగా సహకరిస్తానని శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పీఏసీఎస్ డైరెక్టర్ నాగులునాయక్, నాయకులు భీమయ్యగౌడ్, మైసయ్య శ్రీను, భీమరాజు, లాలయ్య, సుబాష్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ టీచర్ పదవీ విరమణ

చారకొండ, జూలై 13: మండల కేంద్రానికి చెందిన మొదటి అంగన్‌వాడీ కేంద్రం టీచర్ కళావతమ్మ పదవీ విరమణ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళావతమ్మ దంపతులకు ఐసీడీఎస్ సూపర్ వైజర్లు రశీద, పద్మావతి, నిర్మలతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు వారికి శాలువా, పూలమాలలతో సన్మానించారు. అనంతరం సూపర్ వైజర్ రశీద మాట్లాడారు. పీఏసీఎస్ చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్, అచ్చంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకటయ్యగౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఏమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంటులు పానుగంటి అంజయ్య, కేశమోని మహేష్‌గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ జగన్ మోహన్, మండల యూత్ ప్రెసిడెంట్ గణేష్‌గౌడ్, రాచమళ్ల చంద్రశేఖర్,తాజా మాజీ ఎంపీటీసీ గ్యార లక్ష్మయ్య, చారకొండ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు లక్ష్మయ్యగౌడ్, గుండె శివగౌడ్, గజ్జె కొండలయ్యగౌడ్, కేశమోని శంకర్‌గౌడ్, కందికంటి కిరణ్‌గౌడ్, ఏలే సుదర్శన్, కుకుడాల శ్రీనివాసులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

శనీశ్వర స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు

బిజినేపల్లి, జూలై 13 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం నంది వడ్డెమాన్‌లోని సార్థ సప్త జేష్టదేవి సమేత శనీశ్వర స్వామికి శనివారం భక్తులు నల్లని వస్త్రాలు ధరించి నల్లని నువ్వులు, తిల తైలాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గవ్వమఠం శాంతికుమార్ మాట్లాడారు.

వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు తెల్లవారు జాము నుంచి శనీశ్వర స్వామిని, బ్రహ్మ సూత్రం ఉన్న పరమశివుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రావు, కమిటీ సభ్యులు వీరశేఖర్, ప్రభాకరాచారి, ఆలయ సహాయ అర్చకులు గవ్వమఠం ఉమ్మయ్య జయంత్, సిబ్బంది గోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.